సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



దొంగల అరెస్ట్
చోరీ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి 40 గ్రాముల బంగారం రికవరీ చేసినట్టు నరసాపురం డీఎస్పీ తెలిపారు.
8లో ►



ప్రకృతి సేవ.. రైతుకు తోవ
ప్రకృతి సాగును ప్రోత్సహించేలా గుండుగొలనుకుంటకు చెందిన రైతు కషాయాలను తయారుచేసి అందిస్తున్నారు.
8లో ►



పాఠశాలలకే 'విద్యాకానుక'
పాఠశాలలు ప్రారంభించే నాటికి విద్యార్థులందరికీ విద్యాకానుక కిట్లు అందిస్తామని జిల్లా పరిశీలకుడు తెలిపారు.
8లో ►

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం)	సహరి (శనివారం వేకువజామున)
భీమవరం	6.26	4.26
తాడేపల్లిగూడెం	6.28	4.35
నరసాపురం	6.26	4.25

మది నిండా జగనన్నే



ప్రతినెలా ఒకటో తారీఖున వేకువజామునే పింఛన్ సొమ్ములు అందుతున్నాయి.. ఇది ఓ అవ్వ మాట
ఏటా రైతు భరోసా సాయం బ్యాంకు ఖాతాలో జమవుతోంది.. ఇది ఓ రైతన్న ఆనందం
మా పిల్లల చదువులకు అమ్మఒడి, విద్యా, వసతి దీవెనలతో ఆదుకుంటున్నారు.. ఇది ఓ తల్లి సంతోషం..
ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు అన్నివర్గాల ప్రజలూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నీరా'జనాలు' పడుతున్నారు.
తమ కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న సంక్షేమ ప్రదాతకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

- 'జగనన్నే మా భవిష్యత్'కి అనూహ్య స్పందన
- ప్రజాప్రతినిధులకు సాదర స్వాగతం
- సంక్షేమ పథకాలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు
- ఉమ్మడి జిల్లాలో సందడిగా కార్యక్రమం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళుతున్న పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు ప్రజలు సాదర స్వాగతం పలికి ప్రభుత్వ పాలనపై సంతృప్తిని తెలియజేస్తున్నారు. మా కుటుంబానికి అండగా ఉంటున్నారయ్యా.. మళ్లీ జగనన్నే వస్తాడు.. ఆయనతోనే మా భవిష్యత్తు అని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఈనెల 7న ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అపూర్వ స్పందన వస్తోంది.

చేసిందే చెబుతూ..
జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ప్రజలను ప్రశ్నలు అడిగి ఎంత లబ్ధి చేకూరిందనే వివరాలను ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తెలుసుకుంటున్నారు. ప్రధానంగా 46 నెలల కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి గత పాలన, ప్రస్తుత పాలనను బేరీజు వేస్తూ అభిప్రాయాలు సేకరించి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేస్తున్నారు. అలాగే ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారు తమ సెల్‌ఫోన్ల నుంచి మిస్డ్‌కాల్ ఇస్తే ఐవీఆర్ఎస్ కాల్ ద్వారా సీఎం జగన్ కృతజ్ఞతలు చెబుతున్నారు. మద్దతు తెలిపిన ప్రతి ఇంటికీ, మొబైల్‌కు వారి అనుమతితో జగన్ స్టిక్కర్ అతికిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 30 వేల మందికి పైగా పార్టీ శ్రేణులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

ఇంటింటికీ ప్రజాప్రతినిధులు : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు ఇంటింటా పర్యటిస్తున్నారు. ఏలూరు జిల్లాలోని 7 నియోజకవర్గాల్లోని 664 రెవెన్యూ గ్రామాలు, ఏలూరు నగరపాలక సంస్థ పాటు 3 మున్సిపాలిటీల్లోని 5.47 లక్షల కుటుంబాలకు పార్టీ కేడర్ వెళ్లేలా సచివాలయాల వారీగా ప్రణాళిక సిద్ధం చేశారు. నియోజకవర్గాల వారీగా ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నాని, దెందులూరులో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఉంగుటూరులో పుప్పాల వాసుబాబు, చింతలపూడిలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, పోలవరంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, నూజివీడులో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు, కైకలూరులో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగుతోంది.

'పశ్చిమ'లో.. పశ్చిమగోదావరి జిల్లాలోని 7 నియోజకవర్గాల్లోని 20 మండలాల పరిధిలోని 409 గ్రామాలు, పట్టణాల్లోని 4.37 లక్షల కుటుంబాలకు పార్టీ కేడర్ వెళ్లేలా ప్రణాళిక అమలు చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా తాడేపల్లిగూడెంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, తణుకులో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, నరసాపురంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఆచంటలో ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, భీమవరంలో గ్రంధి శ్రీనివాస్, పాలకొల్లులో నియోజకవర్గ సమన్వయకర్త కవురు శ్రీనివాస్, ఉండిలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

20వ తేదీ వరకు..
రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్నే మా భవిష్యత్తు పేరుతో 1.60 కోట్ల కుటుంబాలను కలిసి గత పాలన, ప్రస్తుత పాలనకు తేడాలు వివరిస్తూ ప్రభుత్వ పాలనపై ప్రజల సంతృప్తిని తెలుసుకునేలా కార్యక్రమం చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో ఈ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఈనెల 20వ తేదీ వరకూ కార్యక్రమం నిర్వహించనున్నారు.



ఆచంటలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు (ఫైల్)

చాలా మేలు చేశారు
మా కుటుంబం అంతా కూలీ, నాలీ చేసుకుని జీవనం సాగిస్తున్నాం. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు మావి. ముఖ్యమంత్రిగా జగన్ పదవి చేపట్టిన తర్వాత అన్నివిధాలా ఆదుకున్నారు. ఆసరా, రైతు భరోసా తదితర పథకాల ద్వారా మా కుటుంబానికి సుమారు రూ.2,08,000 వరకు సాయం అందింది. వైఎస్సార్ చేయూత పథకంలో వచ్చిన సొమ్ములతో కిరాణా కొట్టు పెట్టుకుని బతుకుతున్నాం. నెలకు రూ.6 వేల వరకూ ఆదాయం వస్తోంది.
– కొనుతుల సావిత్రి, కొనుతుల ముత్యాలమ్మ, కొమ్ముగూడెం, బుట్టాయగూడెం మండలం

మళ్లీ జగనన్నే సీఎం
ప్రభుత్వ పథకాలు మా కుటుంబానికి ఆర్థిక తోడ్పాటునిస్తున్నాయి. డ్వాక్రా రుణమాఫీ సొమ్ము అందింది. చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పున మూడేళ్లుగా పొందుతున్నా. మా కోడలు వలంటీర్‌గా చేస్తోంది. ఆమెకూ డ్వాక్రా రుణమాఫీ అందింది. అర్హులందరికీ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. మళ్లీ జగనన్నే సీఎం కావాలని, ఆయన ద్వారానే మా భవిష్యత్ బాగుంటుందనే విశ్వాసం ఉంది.
– కటికతల నాగమణి, మాదివాడ, ఆకివీడు

న్యూస్‌రీల్

గవర్నర్‌ను కలిసిన ఉద్యాన వర్సిటీ వీసీ



గవర్నర్‌తో వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం: విజయవాడ రాజ్‌భవన్‌లో గురువారం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ తోలేటి జానకీరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామీణ మహిళల కోసం నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మహిళలు తయారు చేసిన జ్ఞాపికలు, ఉద్యాన పంచాంగం, వర్సిటీ ప్రచురణలను అందజేశారు. వర్సిటీ సందర్శనకు రావాల్సిందిగా ఆహ్వానించారు. వీసీ వెంట వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు ఉన్నారు.

18న దివ్యాంగులకు జాబ్‌డ్రైవ్
సాక్షి, భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 18న భీమవరంలో దివ్యాంగులకు మినీ జాబ్‌డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎ.కృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయలం రోడ్డులోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్‌డ్రైవ్‌లో వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని, పదో తరగతి ఆపై చదివిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 86885 94244 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

స్కానింగ్ కేంద్రం సీజ్



స్కానింగ్ మెషీన్లను సీజ్ చేస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని మైత్రీ సిటీ స్కానింగ్ సెంటర్‌ను గురువారం వైద్యారోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు స్కానింగ్ సెంటర్ల తనిఖీలు చేపట్టామని నరసాపురం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.ప్రసాద్ తెలిపారు. మైత్రీ సిటీ స్కానింగ్ అండ్ డయాగ్నోస్టిక్ సెంటర్ యాజమాన్యం రెన్యూవల్‌కు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు సమర్పించని కారణంగా సీజ్ చేసి చర్యలు చేపట్టామన్నారు. రెండు స్కానింగ్ మెషీన్లు, అల్ట్రా సౌండ్ మెషీన్‌కు సీలు వేశామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మోనిటరింగ్ కన్సల్టెంట్ వి.సత్యరవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.కృపరాజు, వీఆర్వో కె.సుబ్రహ్మణ్యం ఉన్నారు.

భళా రిషిక




ప్రశంసాపత్రం అందుకుంటున్న చిన్నారి రిషిక

ఆకివీడు: కోళ్లపర్రు గ్రామానికి చెందిన చిన్నారి రుషిక కేశిరెడ్డి 15 నెలల వయసులోనే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. కేశిరెడ్డి కిరణ్‌కాంత్, తనూజ కుమార్తె రిషిక జ్ఞాపకశక్తితో ఔరా అనిపించింది. ఈనెల 12న హైదరాబాద్‌లోని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యాలయంలో సుమారు 140 వస్తువులు, జంతువులు, పండ్లు, పక్షులు, కూరగాయలు, వాహనాల వంటి పలురకాల పేర్లను గుర్తుపట్టి ప్రశంసాపత్రం, జ్ఞాపిక, మెడల్ అందుకున్నట్టు చిన్నారి తాత కేశిరెడ్డి ప్రభాకరరావు తెలిపారు.

97.92 శాతం హాజరు
సాక్షి, భీమవరం: జిల్లావ్యాప్తంగా గురువారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 97.92 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ ఆర్.వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. 22,797 మందికి 22,322 మంది హాజరయ్యారన్నారు. 44 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశామని ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

నిన్ను నమ్మం.. బాబూ

- రాజధాని పేరుతో నూజివీడును నట్టేటా ముంచారు
- పదేళ్లయినా కోలుకోని రియల్ ఎస్టేట్
- నియోజకవర్గ టీడీపీలో మూడు ముక్కలాట
- నేడు చంద్రబాబు పర్యటన



సాక్షి ప్రతినిధి, ఏలూరు: 2014లో నూజివీడు ప్రాంతాన్ని రాజధానిగా చేస్తామని ప్రకటించారు. 23 వేల ఎకరాల ప్రభుత్వ భూమి దానిలో 13,166 ఎకరాల అటవీ భూమి ఉందని అసెంబ్లీలోనే ప్రకటించారు. రాజధాని ఏర్పాటుకు గుర్తించిన మూడు ప్రాంతాల్లో నూజివీడుకే ఎక్కువ అవకాశాలని చెప్పారు. పార్టీ కేడర్‌తో పాటు బడా రియల్టర్లు చంద్రబాబు మాట నమ్మి వందల కోట్లు కుమ్మరించి ఎడాపెడా భూములు కొన్నారు. చివరకు ముఖ్య అనుచరగణంతో తూళ్లూరు ప్రాంతంలో వేల ఎకరాల భూములు కొనుగోలు చేయించి రాజధాని అక్కడ పెట్టి నూజివీడు నెత్తిన చెయ్యిపెట్టారు. పర్యవసానంగా చిన్నస్థాయి నుంచి భారీ రియల్టర్ల వరకు పెద్ద ఎత్తున నష్టపోయి నేటికీ కోలుకోలేని పరిస్థితి. కృష్ణా జిల్లాకు చెందిన ఇద్దరు చిన్న రియల్టర్లు చంద్రబాబు మాటలు నమ్మి నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నారు. ఇది నూజివీడుకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చేసిన ద్రోహం. ఆయన శుక్రవారం నూజివీడులో పర్యటించనున్నారు. ఇదేమి ఖర్మ–మన రాష్ట్రానికి అనే పేరుతో రోడ్డుషో నిర్వహించి సభలో ప్రసంగించనున్నారు. ఈ పరిణామాల క్రమంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా నూజివీడుకు ఏం చేశారనే దానిపై సర్వత్రా నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. చంద్రబాబు ఐదేళ్ల పదవీ కాలంలో మూడుసార్లు నూజివీడు వచ్చినా కనీసం రూ.3 కోట్ల నిధులు కూడా ఇవ్వలేదు. ఇక రాజధాని పేరుతో చేసిన మోసంతో ఇప్పటికీ ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. మామిడితో పాటు ఇతర మెట్ట ప్రాంత పంటలకు నూజివీడు ఖ్యాతిగాంచింది. ఇక్కడ రాజధాని ఏర్పాటు చేస్తామంటూ హడావుడి చేసి వందల కోట్లు పెట్టుబడులు పెట్టించి రూ.లక్షల్లో ఉన్న భూముల ధరలను రూ.కోట్లు చేశారు. చివరకు రాజధాని ఇక్కడ కాదనడంతో రియల్‌ఎస్టేట్ నిలువునా కుప్పకూలింది. నూజివీడు నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను పట్టించుకోకపోగా రాజధాని పేరుతో పాడు చేశారనే అభిప్రాయం జనాల్లో బలంగా నాటుకుపోయింది.

అంతర్గత కుమ్ములాటలు
నూజివీడు తెలుగుదేశం పార్టీలో మూడు ముక్కలాట నడుస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఉన్నా చంద్రబాబు సొంత సామాజికవర్గ నేతలు వేరే కుంపటి పెట్టి ఇన్‌చార్జికి తరచూ ఝలక్‌లు ఇచ్చి గందరగోళం సృష్టిస్తున్నారు. వరుసగా రెండు ఎన్నికల్లో ముద్దరబోయిన ఓడిపోయినా పార్టీ జెండా మోస్తున్నారు. ఇతని తీరుపై బాబు సామాజికవర్గానికి చెందిన కాపా శ్రీనివాసరావు, పర్వతనేని గంగాధర్లు వేరే కుంపట్లు పెట్టి సొంత అజెండాతో వెళ్లడం పార్టీకి తలనొప్పిగా మారింది. మూడు రోజుల క్రితం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు జోక్యం చేసుకుని సమన్వయంతో పనిచేయాలని సూచించినా ఫలితం లేదు. ఇదే పరిస్థితి ఏలూరు జిల్లాలోని కైకలూరు, చింతలపూడి నియోజకవర్గాల్లో కొనసాగుతుంది. ఆశావహులందరికీ టికెట్ మీదేనని చెప్పడంతో ఇష్టానురీతిలో పనిచేసేలా చేస్తున్నారు. ఫలితంగా చింతలపూడి, కైకలూరు నియోజకవర్గాల్లో కనీసం ఇన్‌చార్జులను నియమించలేని పరిస్థితి తెలుగుదేశం పార్టీది.

పోలీసులకు ఉగాది పురస్కారాలు



కేవీ సత్యనారాయణ



సీహెచ్ సూర్యప్రకాశరావు



పి.సింగరాజు



కె.నాగమునీంద్ర



కొయ్యే జయరాజు

సాక్షి, భీమవరం: జిల్లాకు చెందిన పలువురు పోలీస్ అధికారులు, సిబ్బందికి ఉగాది ఉత్తమ సేవా పురస్కారాలు వరించాయి. జిల్లాకు చెందిన దిశ డీఎస్పీ, జంగారెడ్డిగూడెం డీఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న కూనపరెడ్డి వెంకట సత్యనారాయణ ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. అలాగే భీమవరం అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు, భీమవరం ట్రాఫిక్ ఏఎస్సై పి.సింగరాజు, వీరవాసరం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కొయ్యే జయరాజు సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కె.నాగమునీంద్రకు ఉత్తమ సేవా పతకం దక్కింది.

ఏలూరు జిల్లాలో..
ఏలూరు టౌన్: ఏలూరు ఏఆర్ ఎస్సై ఏబీఆర్ ప్రసాద్, గణపవరం ఏఎస్సై ఎన్.నాగసుబ్బారావు, ఏలూరు కమ్యూనికేషన్స్ ఏఎస్సై ఎం.సాయి సుధాకర్, ద్వారకాతిరుమల కానిస్టేబుల్ ఎస్ఎల్ఎస్ అశోక్ సేవా పతకాలకు ఎంపికయ్యారు. విజిలెన్స్ విభాగంలో ఏలూరు హెచ్‌సీ కె.వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు ఎన్.రాంబాబు, బీవీ దుర్గారావుకు సేవా పతకాలు వరించాయి.

13న జాతీయ లోక్‌అదాలత్
ఏలూరు (టూటౌన్): జిల్లాలోని కోర్టులున్న అని ప్రదేశాల్లో వచ్చేనెల 13న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆమె మాట్లాడారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నామన్నారు. సత్వర న్యాయానికి లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాశ్వత న్యాయ పీఠం న్యాయమూర్తి ఏ.మేరీ గ్రేస్‌కుమారి మాట్లాడారు.



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి

ధాన్యం కొనుగోలుకు సిద్ధం

- జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో సాగు
- 9.28 లక్షల టన్నుల దిగుబడి అంచనా
- 356 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



పాలకొల్లు మండలంలో యంత్రంతో వరి మాసూళ్లు చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జిల్లాలో దాళ్వా వరి మాసూళ్లు ప్రారంభమవుతున్న తరుణంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. రైతులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉండటంతోపాటు వాతావరణం అనుకూలించడంతో దాళ్వా వరి పంట ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 50 బస్తాల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ముందుగా నాట్లు వేసిన రైతులు మాసూళ్లు చేపట్టారు. ఎక్కువ మంది రైతులు కోతలకు యంత్రాలను వినియోగిస్తున్నారు.

9.28 లక్షల టన్ను దిగుబడి
జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2.19 లక్షల ఎకరాల్లో దాళ్వా నాట్లు వేయగా దాదాపు 9.28 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారుల అంచనా వేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి 356 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు.

ధరలు ఇలా..
దాళ్వా ధాన్యం ధరలను 100 కిలోల కామన్ రకం రూ.2,040, ఏ గ్రేడ్ రకం రూ.2,060గా ప్రభుత్వం నిర్ణయించింది. 75 కిలోల బస్తా కామన్ రకం రూ.1,530, ఏ గ్రేడ్ రకం రూ.1,545కు కొనుగోలు చేస్తారు. ప్రభుత్వ మద్దతు ధరల కంటే మార్కెట్‌లో వ్యాపారులు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తే రైతులు నిరభ్యంతరంగా అమ్ముకోవచ్చు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు చేస్తే గోనె సంచులు వినియోగానికి సంచికి రూ.3.39 పైసలు, హమాలీ చార్జీ టన్నుకు రూ.220, రవాణా చార్జీలు దూరాన్ని బట్టి చెల్లిస్తారు. ధాన్యంలో తేమ 17 శాతానికి మించకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

356 కొనుగోలు కేంద్రాలు



రైతుల నుంచి దాళ్వా ధాన్యం కొనుగోలుకు 356 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు చేసుకోవాలి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే వ్యాపారులు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తే పంటను విక్రయించవచ్చు. పంట ఆశాజనకంగా ఉన్నందున రైతులు పూర్తి శ్రద్ధ తీసుకుని మాసూళ్లు చేపట్టాలి.
– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

మండలాల వారీగా...

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)	ధాన్యం దిగుబడి (టన్నుల్లో)
భీమవరం	8,895	36,994
ఆచంట	10,320	42,562
ఆకివీడు	5,050	20,829
అత్తిలి	13,992	57,703
యలమంచిలి	5,830	24,044
గణపవరం	11,902	49,090
ఇరగవరం	13,307	54,884
కాళ్ల	4,367	18,016
మొగల్తూరు	1,192	4,921
నరసాపురం	9,255	38,172
పాలకోడేరు	12,125	50,005
పాలకొల్లు	9,952	41,048
పెంటపాడు	21,402	88,264
పెనుగొండ	11,890	49,034
పెనుమంట్ర	12,327	50,842
పోడూరు	13,615	56,157
తాడేపల్లిగూడెం	25,170	1,03,803
తణుకు	11,102	45,784
వీరవాసరం	12,370	51,017
ఉండి	11,047	45,562

పారదర్శకంగా ఓటర్ల జాబితా
భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లావ్యాప్తంగా ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు నిర్ణీత గడువులోపు సిద్ధం చేస్తామని, పారదర్శకంగా జాబితా రూపొందించనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఓటర్లకు సంబంధించి లాజికల్ ఎర్రర్ గుర్తించామని, వాటిని సరిచేస్తామన్నారు. ఇప్పటికే ప్రకటించిన ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్నామని, ఎపిక్ కార్డుల డేటా ఎంట్రీ చేశామన్నారు. కొన్ని కార్డులను చిరునామా, మార్పుల కారణంగా తిరిగి పంపామన్నారు. ఈవీఎంలను భద్రపరిచేందుకు నరసాపురం, తాడేపల్లిగూడెంలో గోడౌన్లు పరిశీలిస్తున్నామన్నారు. డీఆర్వో కె.కృష్ణవేణి, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, భీమవరం ఆర్డీఓ దాసి రాజు పాల్గొన్నారు.

16న రోడ్డు కం రైల్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేత
సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం రోడ్డు కమ్ రైల్ బ్రిడ్జిపై మరమ్మతుల కోసం ఈనెల 16న ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వంతెనపై రాకపోకలు నిలిపివేస్తున్నట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. రైల్వే, ఆర్అండ్‌బీ అధికారుల ప్రతిపాదన మేరకు వంతెనపై చేయాల్సిన 20 పనుల్లో పది పనులను మార్చి 25న చేపట్టామన్నారు. మిగిలిన పనులను 16వ తేదీన నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ నియామకాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : వివిధ దేశాల్లో ఉద్యోగాల భర్తీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అంతర్జాతీయ కౌశల్ మహోత్సవంలో భాగంగా మొదటి సారిగా చేపడుతున్న అంతర్జాతీయ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి పీ.రజిత ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోసం కౌశల్ మహోత్సవ్ వెబ్‌సైట్‌లో తమ పేర్లను ఈ నెల 16 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో 08812 - 230269 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ట్రిపుల్ ఐటీలో ఐఓటీ గ్రాండ్ ఎక్స్‌పో

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో ఈసీఈ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 16 వరకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ)పై మూడు రోజుల పాటు ఐఓటీ గ్రాండ్ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. టెక్నాలజీ రంగంలో ఐఓటీ వల్ల పెనుమార్పులు సంభవించనున్నాయని ఆయన అన్నారు. భవిష్యత్ అంతా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌కు సంబంధించిందే ఉండనున్న నేపథ్యంలో దీనిపై విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేందుకు ఈ గ్రాండ్ ఎక్స్‌పోను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఎక్స్‌పోలో ఐఓటీలో నిపుణులైన వారిచే చర్చా కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. 8, 9 తరగతి విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి పలు పాఠశాలలను ఆహ్వానించినట్లు తెలిపారు.

ప్రకృతి సేవ.. రైతుకు తోవ..

సేంద్రియ సాగుకు ప్రాధాన్యం పెరిగినా.. సాగులో వినియోగించే కషాయాల తయారీ రైతులకు కష్టతరంగా మారింది. దీనిని గుర్తించిన జిల్లా రైతు తానే వాటి తయారీకి నడుం బిగించాడు. తక్కువ ధరకు రైతులకు అందిస్తూ సేంద్రియ సాగుకు తనవంతు సహకారం అందిస్తున్నాడు. వాటిద్వారా సత్ఫలితాలు వస్తుండటంతో అతని సేవలు ఇప్పుడు రాష్ట్రాలు కూడా దాటాయి. తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోని రైతులకు కూడా కషాయాలు పంపిస్తుండటం విశేషం.

- ప్రకృతి సాగుకు ప్రోత్సాహం
- ఇతర రాష్ట్రాలకూ ఎగుమతులు

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్ : సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు ఇప్పుడు డిమాండ్ పెరుగుతోంది. సహజ పద్ధతిలో పండించిన పంటలను ఉపయోగించడం ఆరోగ్యానికి మేలని గుర్తించిన ప్రజలు వాటి వినియోగానికే ప్రాధాన్యమిస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో రైతులు సేంద్రియ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో సాగు విస్తీర్ణం క్రమేపీ పెరుగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో గతంలో 400 ఎకరాలతో ప్రారంభమైన సేంద్రియ సాగు 80 వేల ఎకరాలకు విస్తరించింది.

కషాయాలకు పెరిగిన డిమాండ్...

రసాయన ఎరువులు, పురుగుమందులను దుకాణంలో కొని తెచ్చుకునే రైతులకు సేంద్రియ సాగులో ఉపయోగించే కషాయాల (మందుల) తయారీ శ్రమతో కూడినదిగా మారింది. ఈ క్రమంలో ద్వారకాతిరుమల మండలం గుండుగొలనుకుంటకు చెందిన రైతు ఒబిలిశెట్టి గోపాలకృష్ణ తానే వాటి తయారీకి నడుం బిగించాడు. గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ఏర్పాటుచేసి వాటిని తయారు చేస్తున్నాడు. ప్రకృతి నుంచి లభించే వనరులతోనే సేద్యానికి ఉపయోగించే కషాయాల తయారీ ప్రారంభించాడు. తాను సాగు చేస్తున్న ఐదెకరాల పొలంలో పామాయిల్, నిమ్మ పంటలతో పాటు కూరగాయలను సహజసిద్ధమైన ఎరువులతో పండిస్తూనే.. సేంద్రియ ఎరువులు, కషాయాలు కూడా తయారు చేస్తున్నాడు. గతంలో సేంద్రియ సాగు విధానంలో రిసోర్స్‌పర్సన్‌గా పనిచేసిన అనుభవం అతనికి ఉపయోగపడింది. ఇప్పుడు ఉమ్మడి జిల్లాలోని దాదాపు 1000 మంది రైతులకు వాటిని తక్కువ ధరకే అందిస్తున్నాడు. దీంతో పాటు పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని రైతులకు మిర్చి సాగు కోసం కషాయాలు సరఫరా చేస్తున్నాడు. ఇక్కడి నుంచి చిత్తూరు జిల్లా వరకు ఉన్న రైతులు సుమారు 400 మందికి కషాయాలు సరఫరా చేస్తుండటం గమనార్హం. తెలంగాణలోని దాదాపు 200 మందికి, కర్నాటకలోని దాదాపు 50 మంది రైతులకు వీటిని ఎగుమతి చేస్తుండటం విశేషం.

సేంద్రియ సాగుకు కషాయాలు అందిస్తున్న గుండుగొలనుకుంట రైతు



తెలంగాణ రైతులకు శిక్షణ అందిస్తున్న దృశ్యం

ఉచితంగా శిక్షణ...

కషాయాలు, ఎరువులు తయారు చేసి రైతులకు తక్కువ ధరకే అందిస్తున్న గోపాలకృష్ణ.. వాటి తయారీలో రైతులకు, యువతకు ఉచితంగా శిక్షణ సైతం అందిస్తున్నాడు. ఇప్పటివరకు దాదాపు 500 మంది రైతులకు శిక్షణ అందించడం గమనార్హం. 20 ఆవులతో గోశాలను సైతం ఏర్పాటు చేశాడు.

పురస్కారాలు, అవార్డులు...

సేంద్రియ సాగులో రైతులకు తనవంతు సహకారం అందిస్తున్న గోపాలకృష్ణ పలు పురస్కారాలు, అవార్డులకు ఎంపికయ్యారు. 2020, 21 సంవత్సరాల్లో ఉత్తమ ప్రకృతి వ్యవసాయదారునిగా, ఆదర్శ రైతుగా రెండు పురస్కారాలు అందుకున్నాడు. వాటితో పాటు రైతు నేస్తం అవార్డుకు కూడా ఎంపికయ్యాడు.



తయారు చేసిన కషాయాలతో గోపాలకృష్ణ



రైతులకు పంపేందుకు సిద్ధం చేసిన కషాయాలు

తయారు చేసే కషాయాలివీ...

- **నీమాస్త్రం** : అన్నిరకాల పురుగు గుడ్లను చంపుతుంది. రసం పీల్చే పురుగులను, చిన్న గొంగళి పురుగులను నివారిస్తుంది.
- **అగ్నాస్త్రం** : అన్ని రకాల కాయతొలుచు, కాండం తొలుచు పురుగులను నివారిస్తుంది.
- **బ్రహ్మాస్త్రం** : అన్ని రకాల గొంగళి పురుగులును, కాయ తొలుచు పురుగులను నివారిస్తుంది.
- **మారేడు పత్రక కషాయం** : వరిలో అగ్గి తెగులు, మెడ విరుపు తెగులును నివారిస్తుంది.
- **వేప గింజల కషాయం** : పొగాకు లద్దె పురుగు, శనగపచ్చ పురుగు, కాయ తొలుచు పురుగులను నివారిస్తుంది.
- **కోడిగుడ్డు నిమ్మరసం** : పంటలు ఆరోగ్యంగా పెరిగేందుకు ఉపకరిస్తుంది.
- **పంచగవ్య** : మొక్కకు రోగనిరోధక శక్తిని ఇచ్చి చీడపీడలను నివారిస్తుంది. ఆకు ముడత, కూజా తెగులు, సీతాఫలం తెగుళ్లను నివారిస్తుంది.
- **వావిలాకు కషాయం** : అన్ని పంటల్లో వచ్చే రసం పీల్చే పురుగులు, చిన్న లద్దె పురుగులను నివారిస్తుంది.

ఇవిమాత్రమే కాకుండా నవధాన్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నాడు. జీవామృతం, ఘన జీవామృతాలు తయారు చేసి పంటలు ఆరోగ్యకరంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాడు.

ఆరోగ్యకరమైన ఆహారం అందాలని...



నాతో పాటు పదిమంది రైతులను మార్చి ఆరోగ్యకరమైన పంటలు పండించే విధంగా సిద్ధం చేద్దామని నిర్ణయించుకున్నా. నాకు వచ్చిన విద్యను పదిమందికి నేర్పిస్తున్నా. వారు కూడా ప్రకృతి పంటలు పండించాలి. భవిష్యత్తులో అందరికీ ఆరోగ్యకరమైన ఆహారం అందాలనేది నా కోరిక.

– ఒబిలిశెట్టి గోపాలకృష్ణ

బ్యాంకు అప్రైజర్ అరెస్టు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో అవకతవకలకు పాల్పడి రూ.69.73 లక్షలు మోసం చేసిన నేరంపై అప్రైజర్ మొరపాక రామశేషాచార్యులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. రామశేషాచార్యులు బంగారు వస్తువుల అప్రైజర్‌గా పనిచేస్తున్నాడు. అతను తనకు తెలిసిన వ్యక్తులు, స్నేహితులతో కలిసి నకిలీ ఆభరణాలు స్వచ్ఛమైనవిగా ధ్రువీకరిస్తూ రుణాలు మంజూరు చేసేలా చేశాడన్నారు. ఇలా 29 మంది పేరిట 113 ఖాతాలకు రూ. 69,72,990 రుణం మంజూరైందన్నారు. ఈ నకిలీ బంగారు వస్తువుల్ని 3.600 కేజీలుగా గుర్తించారు. ఈ రుణాన్ని రామశేషాచార్యులు వ్యక్తిగత అవసరాల కోసం దుర్వినియోగం చేశాడన్నారు. దర్భగూడెం బ్రాంచ్‌లోని ప్యానల్ అప్రైజర్ ద్వారా బంగారు వస్తువుల తనిఖీ చేపట్టడంతో మోసం బయటపడిందన్నారు. జంగారెడ్డిగూడెం బ్రాంచ్ ద్వారా మొత్తం 1823 ఖాతాలకు రుణాలు మంజూరు చేయగా, ఈ ఖాతాలకు సంబంధించిన బంగారు నగల ప్యాకెట్ల వాస్తవికతను నలుగురు తనిఖీ అధికారులు ధ్రువీకరించారు. మొత్తం 1823 బంగారు ఆభరణాల ప్యాకెట్లలో 113 ప్యాకెట్లు నకిలీగా గుర్తించారు. ఈ వస్తువుల మీద 29 మంది వ్యక్తులకు రుణాలు మంజూరు అయినట్లు గుర్తించారు. అప్రైజర్‌తో పాటు నకిలీ బంగారు ఆభరణాలు పెట్టి రుణాలు పొందిన 29 మందిపై చర్యలు తీసుకోవాలని మేనేజరు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పట్టణంలో పలు బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల్లో కూడా ఈ తరహా మోసాలు జరిగినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరో బ్యాంకులో పనిచేసే అప్రైజర్ తన భార్య పేరున బ్యాంకు ఆఫ్ ఇండియాలో నకిలీ బంగారు వస్తువులు పెట్టి రుణం పొందారు. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో హడావుడిగా రుణం చెల్లించినట్లు తెలిసింది.

చేపల చెరువులో మునిగి వ్యక్తి మృతి

ఉండి: ఉండి మండలం చెరుకువాడలోని చేపల చెరువులో ఓ వ్యక్తి మునిగి మృతి చెందడంతో పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వీరవాసరం మండలం మత్స్యపురికి చెందిన కొయ్యే రవి(33) ఉండి మండలం చెరుకువాడలోని నంబూరి శ్రీనివాసరాజుకు చెందిన చేపల చెరువుపై అన్న రమేష్‌కు బదులుగా కొద్ది రోజుల నుంచి పనిచేస్తున్నాడు. బుధవారం చెరువులో ఉన్న చేపల మేతల సంచులను విప్పేందుకు వెళ్లి నీటిలో పడిపోయాడు. చెరువు వద్ద పనిచేస్తున్న వ్యక్తి అతనిని పిలిచేందుకు రాగా కనపడకపోవడంతో యజమానికి విషయాన్ని చెప్పాడు. చెరువులో మృతి చెంది ఉండటాన్ని గమనించి మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా గురువారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు గన్‌బజార్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం గుజ్జులకొండ గ్రామానికి చెందిన జమ్ముళ్ళమూడి విక్టర్ ఇమ్మానియేల్ (24) ఏలూరు శివారులోని ఆశ్రం ఆసుపత్రిలో శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతను బుధవారం అర్ధరాత్రి ఏలూరు గన్‌బజార్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతి చెందాడు.

రైలు నుంచి జారి విద్యార్థికి గాయాలు

విజయవాడ వీఐటీ కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న మధుప్రీతమ్ ఏలూరు సత్రంపాడు వద్ద ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కాకినాడకు చెందిన సుగుమంచిపల్లి మధుప్రీతమ్ స్నేహితుడు శ్రీరామ్‌తో కలిసి గురువారం సాయంత్రం విజయవాడ నుంచి ఈస్ట్‌కోస్ట్‌లో ప్రయాణిస్తున్నారు. రైలు డి సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐ కళాశాల సమీపానికి చేరుకునే సమయంలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. స్నేహితులు అప్రమత్తమై మధుప్రీతమ్ పడిపోయిన ప్రాంతానికి చేరుకుని ఆటోలో ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రికి తరలించారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌కు రిమాండ్

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీలో నిధుల దుర్వినియోగం కేసుకు సంబంధించి వెల్ఫేర్ అసిస్టెంట్ నీలపు సతీష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 15 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ కే.రాజరెడ్డి చెప్పారు. ఇంటి పన్ను, కుళాయి పన్ను వసూలు చేసి దుర్వినియోగం చేశారని, 2022 మార్చి 25న అప్పటి కమిషనర్ ఫిర్యాదు చేశారని చెప్పారు. అప్పటి నుంచి పరారీలో ఉన్నాడని, తమకందిన సమాచారం మేరకు ఈ నెల 12న రాత్రి భీమవరం రైల్వే స్టేషన్ వద్ద సతీష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురం సంతమార్కెట్ వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ముగ్గురిలో ఒక యువకుడు చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతాకు చెందిన సురజిత్(30), శ్రీకాంత్, రాజిత్‌దాస్‌లు తణుకులో నగల తయారీ పని చేస్తున్నారు. ఈ ముగ్గురు చినవెంకన్న దర్శనార్థం ఈనెల 12న బైక్‌పై ద్వారకాతిరుమలకు వెళ్లారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి శ్రీకాంత్ బైక్‌ను అతి వేగంగా నడిపి ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టాడు. ఏలూరు ప్రభుత్వాస్పత్రికిలో చికిత్స పొందుతూ సురజిత్ మృతి చెందాడు.

బంగారు నగల దొంగల అరెస్టు

పెనుగొండ: పెనుగొండలో గత నెల 27న జరిగిన 850 గ్రాముల బంగారం దొంగతనం కేసులో ముగ్గురిని అరెస్టు చేసి.. వారి నుంచి 40 గ్రాముల బంగారం రికవరీ చేసినట్లు నర్సాపురం డీఎస్పీ కే రవి మనోహర చారి తెలిపారు. గురువారం రాత్రి పెనుగొండ సీఐ కార్యాలయంలో మాట్లాడుతూ.. మహారాష్ట్ర షోలాపూర్ జిల్లాకు చెందిన రాజారామ్ దిగంబర్ డీకోలే(56), ఆనంద్ లక్ష్మ దండే, లక్ష్మణ్ రాజారామ్ పిటేకర్‌ను అరెస్ట్ చేసినట్లు వివరించారు. నెల్లూరు జిల్లాకు చెందిన శ్రీపాలజైన్ గుమస్తా బాబూరామ్ నుంచి ఈ నెల 27న పెనుగొండ-వెంకట్రామపురం మధ్య బంగారం ఉన్న బ్యాగ్ చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ జీవీవీ నాగేశ్వరరావు, సీసీఎస్ సీఐ ఏ.రఘు, ఎస్సై ఎస్‌వీవీ రమేష్ దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 13న భీమవరంలో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో బంగారు షాపుల వీధి రోడ్డులో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా.. అదుపులోకి తీసుకుని విచారించారు. పెనుగొండలో మరో నలుగురితో కలిసి వీరు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. నిందితులు మార్చి 26న మహారాష్ట్ర నుంచి రెండు వాహనాల్లో బయలుదేరి 27న నరసాపురం చేరుకున్నారు. నరసాపురంలో జ్యూయలరీ షాపు వద్ద రెక్కీ నిర్వహించారు. బ్యాగ్‌లో గుమస్తా బంగారం పెట్టుకోవడం చూసి అతన్ని ఫాలో అయ్యారు. పాలకొల్లులో ఆ వ్యక్తి తో పాటు ఇద్దరు ఆర్టీసీ బస్సు ఎక్కి వెంబడించారు. రాత్రి ఏడు గంటల సమయంలో వెంకట్రామపురంలో కండక్టరు టికెట్లు కొట్టేందుకు బస్సు ఆపగా, శ్రీపాల్ జైన్ గుమస్తా బ్యాగుతో దిగి మూత్ర విసర్జన చేస్తుండగా అతని వద్ద బ్యాగు లాక్కునేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో మరో అయిదుగురు సుమో వాహనంలో వచ్చి కత్తి చూపి బెదిరించి బంగారు నగల బ్యాగుతో వెళ్లిపోయారు. అక్కడి నుంచి నేరుగా మహారాష్ట్ర వెళ్లిపోయారు. మళ్లీ దొంగతనానికి వచ్చి దొరికిపోయారని తెలిపారు. మిగిలిన వారి కోసం, మిగతా బంగారం రికవరీ కోసం రెండు బృందాలను మహారాష్ట్ర పంపనున్నట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన సిబ్బందిని అభినందించారు.



పెనుగొండ పోలీసులు అరెస్టు చేసిన దొంగలు

గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం: మండలంలోని లింగారాయుడిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



కాళ్ల: మండలంలోని కోపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

నేరుగా పాఠశాలలకే విద్యాకానుక కిట్లు



భీమడోలు ఎంఆర్సీలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రభుత్వ టెక్స్ట్ బుక్స్ రాష్ట్ర డైరెక్టర్, కె.రవీంద్రనాథ్‌రెడ్డి

భీమడోలు: జూన్ 12 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి జగనన్న కానుక కిట్లను అందించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుందని ప్రభుత్వ టెక్స్ట్ బుక్స్ రాష్ట్ర డైరెక్టర్, జేవీకే 4 జిల్లా పరిశీలకులు కె.రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జేవీకే 4 మండల స్థాయి పాయింట్‌ను గురువారం ఎస్‌ఎస్‌ఏ సీఎంఓ జే.రవీంద్రతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రంలో జగనన్న కానుక కిట్ల పంపిణీపై సీఆర్‌పీలు, ఐఈఆర్‌టీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఎస్‌ఎస్‌ఏ సిబ్బందికి మార్గదర్శకాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ డి.సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 1807 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 1.61 లక్షల మంది విద్యార్థులకు వేసవి సెలవులనంతరం పాఠశాలలు ప్రారంభం రోజునే జగనన్న కానుక కిట్లను పంపిణీ చేస్తామన్నారు. ఈ నెల 15 నుంచి మే నెలాఖరు నాటికి కిట్ల పంపిణీ పూర్తవుతుందన్నారు. జూన్ 1 నుంచి ఏడో తేదీ నాటికి మండల స్థాయి పాయింట్లకు చేరుకుంటాయన్నారు. జగనన్న కానుక కిట్లలో 9 రకాలైన జాతీయ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీలు, బెల్ట్, సాక్స్‌లు, బ్యాగులు, బూట్లు, యూనిఫాంలు అందిస్తారన్నారు. తొలుత రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయనను ఎస్‌ఎస్‌ఏ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీఎల్‌ఎన్‌వీ రాఘవన్, పీఆర్ ఏఈ డి.సత్యనారాయణ, ఏపీఎం పి.సురేష్‌కుమార్, సీఆర్‌పీలు, ఎస్‌ఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, అతని భార్యకు గాయాలైన సంఘటన గురువారం తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి సమీపంలో చోటు చేసుకుంది. నిడమర్రు మండలం నాగన్నమిల్లికి చెందిన చవ్వాకుల వీరవెంకటేశ్వరరావు, భార్య వరలక్ష్మి మోటారు సైకిల్‌పై తెలికిచర్లకు బయల్దేరారు. పెదతాడేపల్లి కమ్మ కళ్యాణ మండపం సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా మరో మోటారు సైక్లిస్ట్ బలంగా ఢీకొన్నాడు. దీంతో వెంకటేశ్వరరావు రోడ్డుపై పడగా.. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య వరలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. భర్త మృతితో భార్య కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. మృతుడిని వ్యవసాయ కూలీగా గుర్తించారు. అతని మృతితో నాగన్నమిల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు బలమైన గాయమైందని, హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు తెలిపారు.



పెదతాడేపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన చవ్వాకుల వెంకటేశ్వరరావు, రోదిస్తున్న భార్య వరలక్ష్మి

చెల్లని చెక్కు కేసులో 6 నెలల జైలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): చెల్లని చెక్కు కేసులో మహిళకు 6 నెలలు జైలు శిక్ష విధించారు. చెల్లని చెక్కు ఇచ్చారంటూ శ్రీనివాస్‌రాజు ఫిర్యాదుపై తాడేపల్లిగూడెం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వాదనలు జరిగాయి. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో మహిళకు 6 నెలలు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఫిర్యాదుదారుడికి రూ.2 లక్షలు పరిహారం చెల్లించాలని, లేదంటే మరో 3 నెలలు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు.

సహకార సంఘాల పరిధిలోకి మరిన్ని సేవలు

భీమవరం అర్బన్ : గ్రామీణ సహకార పరపతి సంఘాల పరిధిలోకి మరిన్ని సేవలు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చి వాటి అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని సహకార సంఘాల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నందమూరి వెంకట సుబ్బారావు అన్నారు. భీమవరం మండలంలోని తాడేరులో సహకార పరపతి సంఘంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 10, 11, 12లలో హైదరాబాద్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో జరిగిన వివరాలను వెల్లడించారు. సొసైటీ బ్యాంకుల ద్వారా రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు, సహకారాలు అందిస్తున్నామన్నారు. నాబార్డు, ఆప్కాబ్‌లు వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని సహకార సంఘాలు ద్వారా విద్యుత్ బిల్లులు, సీటీ, ఇంటి పన్నులతో పాటు పీఎం కిసాన్, బీమా సేవలు, ఉచిత న్యాయ సలహా సేవలు, వినియోగ దారుల సేవలు, రైల్వే, ఏపీఎస్‌ఆర్టీసీ తదితర 300 రకాల సేవలను అందించేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో లోసరి గుట్లపాడు సొసైటీ బ్యాంకు సెక్రటరీ కె. పూర్ణచంద్రరాజు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతి ఇంటా జగనన్నే మా భవిష్యత్తు



తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామంలో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ ముత్యాల అంజనేయులు



అత్తిలిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- ఇంటింటికీ ప్రజాప్రతినిధులు
- ప్రజల నుంచి అనూహ్య స్పందన

తాడేపల్లిగూడెం రూరల్: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగనన్న నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా ఆడపడుచులను నమ్మించి మోసగించారన్నారు. ఆ ఉసురు ఊరికిపోదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా సొమ్ములు జమ చేశారన్నారు. ఆడపడుచుల ఆశీర్వాద బలంతో రాబోయే ఎన్నికల్లోనూ జగన్ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. గ్రామ సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ మట్టా సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు. అలాగే, కృష్ణాయపాలెం, నందమూరు, మాధవరం, ఆరుగొలను, మోదుగ గుంట తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.

అత్తిలి: సంక్షేమమే ధ్యేయంగా, అవినీతికి తావులేకుండా సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు అత్తిలి మండలం కొమ్మర గ్రామంలో గురువారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వలంటీర్ సేవలు తదితర అంశాలపై లబ్ధిదారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కునాధరాజు శ్రీహరిరాజు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, గ్రామపార్టీ అధ్యక్షుడు సత్తి గణేష్‌రెడ్డి, ద్వారంపూడి సుబ్బిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాంతామణి, చిటనక వెంకట్రావు, గంజి రామారావు, ఉప్పరగూడెం వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. మంచిలి గ్రామంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సర్పంచ్ చింతారామయ్య, వైస్ ఎంపీపీ దారం శిరీషా, సొసైటీ అధ్యక్షుడు పీవీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాగిరెడ్డి రాజేంద్రప్రసాద్, శ్యాంబాబు, వేంద్ర రాంపండు, దారం చినబాబు, సాధనాల రమేష్, సత్తిపండురెడ్డి తదితరులు పాల్గొన్నారు. గుమ్మంపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు నేలపాటి సుబ్బయ్య, సర్పంచ్ వేగేశ్న ధనసత్యనారాయణరాజు, ఉపసర్పంచ్ వెంకన్నబాబు, చంటిరాజు, యాళ్ల జానకి, బుంగా భరత్, నేలపాటి పద్మ, దండి భవాని, బుంగా సంజీవరావు, ఉన్నమట్ల శ్రీను, యాళ్ల సింగ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తణుకు టౌన్: వైఎస్సార్‌సీపీ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. గురువారం రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆదేశాల మేరకు జిల్లా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఎంపీపీ రుద్ర ధనరాజులు గ్రామాల్లో నువ్వే మా నమ్మకం జగనన్నే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు, దువ్వ, తేతలి, మండపాక, మహాలక్ష్మీ చెరువు, యర్రాయి చెరువు, ముద్దాపురం, కోనాల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. దువ్వ గ్రామంలో నువ్వే మా నమ్మకం జగనన్నే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, మండల రైతు విభాగం అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, ఉప సర్పంచ్ కడియం రాంబాబు, అరిగెల బాబి, నాయకులు ముళ్లపూడి బాబూరావు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ మిత్రలు, తేతలి గ్రామంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, రైతు విభాగం ప్రధాన కార్యదర్శి సరెళ్ల కృపావరం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, నాయకులు సరెళ్ల కృపావరం, కోట స్వామీజీ, సరెళ్ల సతీష్, దారం శ్రీనులతో పాటు గృహ మిత్రలు, వలంటీర్లు, మండపాకలో ఎంపీటీసీ సభ్యులు కాళ్ల సన్యాసిరావు, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, లతో పాటు సచివాలయ కన్వీనర్లు, గృహ మిత్రలు, వలంటీర్లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మహాలక్ష్మీ చెరువు గ్రామంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలా శ్రీను, వలంటీర్లు పాల్గొన్నారు.

వేల్పూరు గ్రామంలో...

తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్నే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, నాయకులు గ్రామంలోని వివిధ వార్డుల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు, నాయకులు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరగవరం: మండలంలోని రాపాక గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటి గోడకు స్టిక్కర్లు అంటించి,బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, జేసీఎస్ కన్వీనర్ దినేష్ రెడ్డి, సర్పంచ్ బృందావనం గోపాల కృష్ణ, పార్టీ గ్రామా అధ్యక్షుడు కొక్కిరాల రాజారావు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సొసైటి అధ్యక్షుడు చిట్నీడి రమేష్, చిట్నీడి శ్రీనివాస్, వీరవల్లి సత్యనారాయణ, చిట్నీడి బలరాముడు, కంతేటి శ్రీనివాస్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి



రావిపాడులో ప్రచారం చేస్తున్న నాయకులు

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో మా నమ్మకం జగనన్నే కార్యక్రమం జోరుగా సాగుతోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రావిపాడు సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, కొండేపాడు ఎంపీటీసీ దేవరశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. జగనన్న నీవే మా నమ్మకం, జగనన్న మా భవిష్యత్ కార్యక్రమాల్లో భాగంగా బి. కొండేపాడు గ్రామం, రావిపాడు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరిమిల్లి త్రి సభ్యకమిటీ సభ్యుడు దేవరశెట్టి రాంబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలా గణపతి, పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు మర్రే కృష్ణమూర్తి, పబ్బారామారావు, గుబ్బల వెంకన్న, బండారు అప్పన్న, అంబటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. రావిపాడు గ్రామంలో సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షులు పెన్నాడ సూరిబాబు, వింజమూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్రవర్ణ పేద మహిళల లబ్ధికే ఈబీసీ నేస్తం



పెంటపాడులో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఈబీసీ లబ్ధిదారులు

పెంటపాడు: అగ్రవర్ణ పేద మహిళలకు మేలు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకాన్ని అమలు చేస్తున్నారని పెంటపాడు గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రెండోవ విడత ఈబీసీ నేస్తంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ వార్డులోని మహిళలు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పుల్లాయగూడెం గ్రామానికి చెందిన అనుమోలు ప్రభాకర్ (45) గుండె సంబంధిత సమస్యతో ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలను గురువారం ఎమ్పీటీసీ సభ్యుడు మార్లపూడి సుబ్బారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చీకట్ల మల్లేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ టి.వెంకటేష్, నాయకులు దూలం ఆంజనేయులు, బుడిగిన పెద్దిరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తణుకు టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా వాయిస్ ఆఫ్ దళిత్ ఆధ్వర్యంలో తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు నిఘంటువులు, డ్రాయింగ్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాయిస్ ఆఫ్ దళిత్ వ్యవస్థాపకుడు అరిగెల రాజేష్, బీ శ్యామ్, కె వెంకట్రావు, దిడ్ల రవి, బయ్యే రాజేష్, వీడీ నరేష్, బీ రాజు, గోపి, గారపాటి సురేష్, కొయ్యే స్టీఫెన్, మాదెల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో ప్రారంభమైన రక్షణ మహోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర క్రిష్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ

పెంటపాడు: పట్టణంలోని ఫెయిత్ చర్చి ప్రాంగణంలో 49వ వార్షిక రక్షణ మహోత్సవాలు గురువారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సంఘస్తుల ప్రత్యేక ప్రార్థనల అనంతరం రాష్ట్ర క్రిష్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ డా. బొల్లవరపు జాన్‌వెస్లీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మరణాన్ని జయించిన క్రీస్తుకు లోబడి ప్రతి విశ్వాసి ఆధ్యాత్మిక శక్తితో జీవించాలన్నారు. క్రైస్తవుల ఉన్నతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో నిబద్ధతతో ఉన్నారన్నారు. గత 49 ఏళ్లుగా రక్షణ సువార్త మహాసభలు ఇక్కడ నిర్వహించడం గర్వకారణమన్నారు. రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్, సుస్మిత ఆనంద్‌ల పర్యవేక్షణలో ఈ సభలు నిర్వహించడం ఈ ప్రాంతానికి దీవెన అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జ్యోతి ఆనంద్ క్రిష్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జ్యోతి ఆనంద్‌ను ప్రత్యేకంగా సన్మానించారు.

శ్లాబ్ కూలి కార్మికుడు మృతి

తాడేపల్లిగూడెం అర్బన్: భవనం గోడలను తొలగిస్తున్న సమయంలో కాంక్రీటు సన్‌సైడ్ కూలి మీదపడటంతో భవన కార్మికుడు మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకొంది. పట్టణ ఎస్సై బి రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ శివారు ఎపిటిడ్కో వద్ద నివాసం ఉంటున్న ఆనక ఏసురాజు (22) భవన నిర్మాణ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం పట్టణంలోని రామారావుపేటలోని ఓ భవనానికి పై అంతస్తులో గోడలు తొలగిస్తున్నాడు. గెడించి మీద నిలుచొని గోడను తొలగించే పనిలో ఉండగా అతని తలపై ఉన్న సన్‌సైడ్ కూలి పడటంతో ఏసురాజు అక్కడిక్కడే మృతి చెందాడు. వెంటనే పట్టణ ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టు ఆవరణలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీటౌన్): పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు ఆవరణలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రకాశ్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నాగమల్లేశ్వరీ, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దాసం సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



తాడేపల్లిగూడెం మండలం లింగారాయుడిగూడెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలి
- లింగరాయుడిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: సీఎం జగన్ రూపొందించిన నవరత్నాల పథకాలు, రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించి, పేదల జీవితాల్లో వెలుగులు పంచుతున్నాయని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం లింగరాయుడిగూడెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ బిడ్డల బంగారు భవిష్యత్ కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు అనేక హామీలు ఇచ్చాడని, అవేమీ అమలు కాలేదన్నారు. జగన్ ఇచ్చిన హామీలకు కట్టుబడి అమలు చేశారన్నారు. ఇంత సమర్థవంతమైన పాలన గతంలో ఏనాడూ చూడలేదన్నారు. టీడీపీ పేరు చెబితే ప్రజలు పారిపోయే పరిస్థితి ఉందన్నారు. జగన్ పాలనలో వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు సంక్షేమ ఫలాలను జమ చేస్తున్నారన్నారు. జగన్ పాలనను భ్రష్టు పట్టించాలని చంద్రబాబు కుట్ర చేస్తున్నాడన్నారు. అయినప్పటికీ సీఎం జగన్ దమ్ము, ధైర్యంతో ముందుకు సాగుతున్నారన్నారు. చెప్పింది చేశాం కనుకనే ప్రతి ఇంటికి రాగలుగుతున్నామన్నారు. సమర్థుడైన సీఎం ఉంటే పాలన ఎలా ఉంటుందో జగన్‌ను చూస్తే తెలుస్తుందన్నారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే జగన్‌ను మరలా గెలిపించాలన్నారు. తొలుత ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎమ్పీటీసీలు వీరమళ్ళ వెంకన్న, మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.విశాలాక్షి, సొసైటీ చైర్మన్లు జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, ఆర్‌బీకే చైర్మన్ ములగాల గంగారావు, సచివాలయ కన్వీనర్ యాతం సత్యనారాయణ (పెద్దోడు), సత్తినీడి కొండలరావు, నాయకులు ముద్రగడ లలితకుమారి, బొద్దాని శ్రీనివాస్, దాకే పండియ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

తాడేపల్లిగూడెం (టీటౌన్): తిరుపతిలో ఈ నెల 16,17,18 తేదీల్లో నిర్వహించే ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని మామిడి దానవర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని జాతీయ కమిటీ ఆవిష్కరించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మామిడి దానవర ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరించడం శోచనీయం అన్నారు. ఈ మహాసభలలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలపై చర్చించేందుకు, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, శేఖర్, రాంబాబు, గంగాధర్, ఆదినారాయణ, అప్పన్న, శివశంకర్, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్‌లు చెల్లించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్‌లు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఉపాధి పని ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఉపాధి పని ప్రాంతంలో మంచినీరు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని రద్దుచేయాలని కోరారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కండెల్లి బాబూరావు, అలమండ కోటయ్య, దేవతల భాస్కరరావు, మోర్స వెంకట్రావు, లంక రమణ, దేవతల జయలక్ష్మి, మోర్స గంగ, చింతాడ మహాలక్ష్మి, అలమండ సూరమ్మ, కండెల్లి ఎస్సిక తదితరులు పాల్గొన్నారు.

ప్రచారభేరీ యాత్రలను విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీటౌన్): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 30వరకు జరిగే ప్రచారభేరీ పాదయాత్రలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం సీపీఐ కపర్థి భవనంలో భీమారావు మాట్లాడుతూ దేశాన్ని కాపాడుకొనేందుకు బీజేపీని గద్దెదించుదామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ విధానాల ఫలితంగా దేశంలో ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎ వడ్డాది మేరీ, ఎం.సీతారాం ప్రసాద్, మండల నాగేశ్వరరావు, ఉల్లింకల జయకృష్ణ, అల్లం రాము, తాటికొండ గంగాభవాని, దాస్యం రాము, బాబి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోరిమిల్లిలో ఉజ్జీవ సభలు

పెంటపాడు: మండలంలోని కోరిమిల్లి సీజీపీ చర్చి సమీపంలో 14 నుంచి మూడు రోజుల పాటు యేసు క్రీస్తు సువార్త ఉజ్జీవ సభలు నిర్వహించనున్నట్లు కన్వీనర్ పాస్టర్ జె. శ్యామ్యూల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బోధకులుగా డబ్ల్యూసీఎం కిరణ్‌పాల్ (గుడివాడ),బ్రదర్ గ్రేస్‌విక్టర్ (పాలచర్ల), పాస్టర్ ప్రేమరాజు (రాజమండ్రి), లంకలకోడేరు, మండపాక, దువ్వ ప్రాంతాలకు చెందిన శామ్యూల్, /జ్ఞానానందం, వినుతికుమార్ తదితర సేవకులతో పాటు, ఆరుగొలనుకు చెందిన సువార్త గాయకులు జె. సాగర్‌బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రతి రోజు సాయంత్రం 7 గంటలకు నిర్వహించబోయే ఈ సమావేశాలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వృద్ధుల సమస్యలపై విద్యార్థులకు అవగాహన అవసరం

తణుకు టౌన్: కుటుంబంలో వృద్ధుల పట్ల గౌరవ భావంతో మెలగాలని తణుకు సీనియర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి చెప్పారు. గురువారం తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కుటుంబంలోని వృద్ధుల పాత్ర- సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, ఎస్ విష్ణు వర్ధన్, సంఘ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, హెల్పేజ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ ఎం పుష్పాంజలి తదతరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 13న జాతీయ లోక్ అదాలత్

తణుకు అర్బన్: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వచ్చేనెల 13వ తేదీన తణుకు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తణుకు ఇన్‌చార్జ్ నాల్గవ అదనపు జిల్లా జడ్జి పి.అన్నపూర్ణ తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు అన్నిరకాల సివిల్, ప్రీలిటిగేషన్, మోటారు వాహన ప్రమాదకేసులు, పరిష్కరించబడునని వివరించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగపరచుకోవాలని కోరారు.

రాచర్లలో నేడు ఉచిత వైద్య శిబిరం

పెంటపాడు: బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14న రాచర్ల గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు గూడెం చైతన్య ఎమర్జన్సీ ఆసుపత్రి సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రి ఎండీ కె. సోమేశ్వరరావు ఆధ్వర్యంలో డాక్టర్ దివ్యశ్రీ, డాక్టర్ కృష్ణకిషోర్ తదితరులు న్యూరో, జనరల్ వైద్యసేవలు అందిస్తారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీటౌన్): తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో గురువారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తాడేపల్లిగూడెం టౌన్, రూరల్ మండలం, పెంటపాడు పరిధిలో పదిహేడు ప్రభుత్వ, జెడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలో సైన్స్ పరీక్ష జరగగా 3,606 మందికిగాను 3,525 మంది హాజరైయారు. 81 మంది హాజరు కాలేదు.

కవి ప్రసాద్‌కు విశిష్ట పురస్కారం

తణుకు: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 10న తిరుపతి నగరంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో తణుకు పట్టణానికి చెందిన కవి ప్రసాద్ విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన రచించిన, చదివి వినిపించిన రాజభాష కాదగిన భాష అనే కవితకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక నిర్వాహకులు ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

చిత్రకారుడు చంద్రరావుకు సత్కారం

తాడేపల్లిగూడెం (టీటౌన్): పట్టణానికి చెందిన చిత్రకారుడు పల్లి చంద్రరావు ఇటీవల హైదరబాద్‌లోని జేఎన్‌టీయూ ఆర్ట్స్ కళాశాలలో జాతీయ స్థాయి చిత్రకళ ప్రదర్శనలో అవార్డు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రొక్కాల నాగబుజ్జి చేతుల మీదుగా గురువారం కార్యాలయంలో చంద్రరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిత్రకారుడు దారం బాలాజీ, సభ్యులు పాల్గొన్నారు.

15లోగా మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తులు

తణుకు టౌన్: మిషన్ వాత్సల్య పథకంలో అర్హులైన వారందరినీ ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని తణుకు మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు కోరారు. గురువారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి ఇప్పటి వరకు తణుకు రూరల్ మండలం నుంచి 336 దరఖాస్తులు, తణుకు మున్సిపాలిటీ నుంచి 290 దరఖాస్తులు, ఇరగవరం మండలం నుంచి 310 దరఖాస్తులు తణుకు సీడీపీవో కార్యాలయానికి అందించినట్లు తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ కూడా అలస్యం లేకుండా దరఖాస్తులు చేసేలా సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టీఎస్ మూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

త్వరగా పూడికతీత పనులు పూర్తి చేయాలి

తణుకు అర్బన్: పారిశుధ్య పనుల్లో జాప్యం లేకుండా పనులు నాణ్యతగా ఉండేలా పారిశుధ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారుల డ్రెయినేజీల్లో పూడికతీత పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలోని ప్రధాన డ్రెయినేజీల్లో పూడికతీత పనులు రూ. 10 లక్షల నిధులతో ప్రారంభించినట్లు తెలిపారు. వేసవి పూర్తై వర్షాలు పడేలోపు పూడికతీత పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. తద్వారా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్య ఉండదని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మారిశెట్టి శేషగిరి, సెక్రటరీలు జగన్, ధీరజ్, శానిటరీ మేస్త్రి బంగారు కరుణరాజు తదితరులు పాల్గొన్నారు.

బేబి సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీటౌన్): బేబి సెంటర్ రోడ్డులో కృష్ణ వల్లభ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు, పీటీ వెంకన్నలు చలివేంద్రంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, పైలు శ్రీనివాస్, పండు, డాక్టర్ కంచర్ల సాయి పృథ్వీ, నరసింహారావు, దూలం నాగరాజు, బాబురావు, రాజేష్, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.